క్లుప్తంగా

ముంపు సమస్యను పట్టించుకోని ప్రభుత్వం



భవానీపురం(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ముంపు సమస్యను పట్టించుకోవడం లేదని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు విమర్శించారు. సోమవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి విద్యాధర పురంలోని రోటరీనగర్ ముంపునకు గురయింది. ఈ సందర్భంగా సీపీఎం బృందం రోటరీ నగర్‌లో పర్యటించింది. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న రోటరీనగర్‌వాసుల ఇబ్బందులను స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా బుడమేరు ఆధునికీకరణ పనులు, శాశ్వత నివారణ చర్యలు చేపట్టకపోతే నగరం మరో మారు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎండీ మస్తాన్, జి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రెప్కో బ్యాంక్ లోన్‌మేళా ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రెప్కో బ్యాంక్ ఆధ్వర్యంలో మార్ట్‌గేజ్ లోన్ మేళా సోమవారం ప్రారంభమైంది. నగరంలోని ఆ బ్యాంక్ వన్ టౌన్, మొయిన్ బ్రాంచ్‌లలో ఈ మేళాను ప్రారంభించారు. వన్‌టౌన్‌లో జరిగిన మేళా ప్రారంభ కార్యక్రమంలో బ్యాంక్ అడిషనల్ జనరల్ మేనేజర్ జయచంద్రన్ జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అవసరమైన అన్ని రకాల సేవలను రెప్కో బ్యాంక్ అందిస్తుందన్నారు. ఈ మేళా ఈ నెల 15వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కే పవన్ చంద్ర మాట్లాడుతూ ఇంటి తనఖాపై అతి తక్కువ వడ్డీతో త్వరతగతిన రుణాలను అందిస్తామన్నారు. డిపాజిట్లపై సీనియర్ సిటజన్లకు అత్యధికంగా ఎనిమిది శాతం, ఇతరులకు 7.5 శాతం వడ్డీని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులకు వీఎంసీ అందిస్తున్న మౌలిక వసతుల్లో సమస్యలు ఉత్పన్నమయితే వెంటనే వాటిని పరిష్కరించేందుకు ఆయా విభాగాల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన సోమవారం ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో మొత్తం 9 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికపై 2, ఇంజినీరింగ్–5, ప్రజారోగ్య విభాగం-1, ఎస్టేట్‌పై -1 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అలసత్వం : రోడ్డెక్కిన జనం

- చిన్న వర్షానికే ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయి
- ఎవరూ స్పందించడం లేదు
- సమస్య పరిష్కరించడం లేదు
- క్రాంబే రోడ్డులో ట్రెండ్‌సెట్ వద్ద ట్రాఫిక్ నిలిపి స్థానికుల ఆందోళన



వర్షపు నీటితో నిండిపోయిన కుండల బజార్



రోడ్డుకు అడ్డంగా నిలబడి ఆందోళన చేస్తున్న కుండల బజార్ వాసులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో సోమవారం తెల్లవారు జామున 4.30 గంటల నుంచి సుమారు గంటన్నర సేపు భారీ వర్షం కురిసింది. వర్షానికి రోడ్లు చెరువులయ్యాయి. డ్రయిన్లు పొంగాయి. గంట వ్యవధిలో విజయవాడ సెంట్రల్‌లో 49.8, వెస్ట్‌లో 49.8, రూరల్‌లో 49.0, ఈస్ట్‌లో 48.6, నార్త్‌లో 48.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా భవానీపురం క్రాంబే రోడ్డులోని స్వాతి సెంటర్ నుంచి రిలయన్స్ ట్రెండ్స్ వరకు రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. దీంతో ఉదయం వివిధ పనుల కోసం వెళ్లే వారు, పిల్లలను స్కూళ్లకు పంపే వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భవానీపురం ప్రియదర్శిని కాలనీలో నాలుగు రోడ్లు జలమయం అయ్యాయి. వైఎస్సార్ పార్క్‌ను ఆనుకుని ఉన్న కుండల బజార్ పూర్తిగా నీట మునిగింది. స్థానికుల ఇళ్లలోకి నీళ్లు చేరాయి. వెంకటేశ్వర పౌండ్రీ రోడ్డు, పాత హెచ్‌బీ కాలనీలోని పలు రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి.

రోడ్డెక్కిన కుండల బజార్ నివాసులు

కుండల బజార్‌లో పూర్తిగా నీరు చేరింది. రోడ్డుపై మోకాలి లోతు నీళ్లు నిలవడం, వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానిక నివాసాల వారు ఆగ్రహంతో రోడ్డెక్కారు. చిన్న వర్షానికే రోడ్డు నీట మునిగిపోతోందని, ఇళ్లలోకి నీరు చేరి నష్టం వాటిల్లుతోందని వాపోయారు. తరచూ వర్షాలకు రోడ్డు నీట మునిగిపోతున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, డ్రైన్లు పారే విధంగా చర్యలు చేపట్టడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రావాలి, మున్సిపల్ కమిషనర్ రావాలి, తమకు న్యాయం చేయాలంటూ క్రాంబే రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ వద్ద ధర్నా నిర్వహించారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి మహిళలు, చిన్నారులు స్థానిక పెద్దలు నినాదాలు చేశారు. వాహనాలు ఆపి తమ సమస్య పరిష్కరించేంతవరకు అక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. డ్రైన్లు పూడిక తీత తీయడం లేదని, చిన్న వర్షానికి నీరు చేరి ఇబ్బందులు పడుతున్నామని అధికారులు వచ్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆందోళన చేశారు. అరగంటకు పైగా వాహనాలు నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ -1 అధికారులు అక్కడికి చేరుకున్నారు. వారితో స్థానికులు కొంత సేపు వాగ్వాదానికి దిగారు. వర్షాకాలం ఇలా రోజూ ఇబ్బందులు పడుతుంటే కనీసం ఏ అధికారి తమ ఏరియా వైపు చూడడం లేదని ఆరోపించారు. అధికారులు వారిని సముదాయించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దత్తత పేరుతో మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పిల్లలు లేని దంపతులకు బాబును దత్తత ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా నకిరేకల్ బొద్రాయి బజార్‌కు చెందిన దాసరి శివ సోదరి మౌనికకు పిల్లలు లేరు. శివ తనకు పరిచయం ఉన్న లక్ష్మణరెడ్డికి విషయం చెప్పగా.. అతనికి తెలిసిన వైద్యురాలి ద్వారా బాబును దత్తత ఇప్పిస్తానని నమ్మించాడు. ఇందుకు రూ.4లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం మేరకు డబ్బులు తీసుకుని విజయవాడకు వస్తే బాబును దత్తత ఇప్పిస్తానని చెప్పి వారిని రప్పించి మౌలాలి, ఫాతిమాలను పరిచయం చేశాడు. దాసరి శివ కొంత నగదు బబ్బూరి శ్రీనివాస్, బుర్ర శ్రీలలిత ఫోన్ నంబర్లకు బదిలీ చేశాడు. ఒప్పందం మేరకు మిగిలిన డబ్బులు చెల్లించారు. ఆ తర్వాత బాబును దత్తత ఇవ్వకుండా మోసం చేయడంతో గత వారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌లో లక్ష్మణరెడ్డి, మౌలాలి, ఫాతిమా, బబ్బూరి శ్రీనివాస్‌లపై శివ ఫిర్యాదు చేశాడు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ డిపో ముంపునకు శాశ్వత పరిష్కారం లేదా?

- వర్షం కురిస్తే జల దిగ్బంధమే
- ఉద్యోగులు లోపలకు వెళ్లే అవకాశం లేదు
- వర్క్‌షాప్ లోపల మెషినరీ వర్షపు నీటిలోనే



ముంపులో విద్యాధరపురం ఆర్టీసీ డిపో

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలో ఉన్న ఆర్టీసీ విద్యాధరపురం డిపో, వర్క్‌షాప్ రోడ్‌లో గల జోనల్ వర్క్‌షాప్‌తోపాటు అదే రోడ్‌లో ఉన్న ఆర్టీసీ టైర్ షాప్ కూడా మళ్లీ జల దిగ్బంధంలో చిక్కుకు పోయాయి. గత నెల 13న కురిసిన భారీ వర్షానికి కూడా ఇలాగే మునిగిపోయాయి. మోకాళ్ల లోతులో నిలిచిపోయే వర్షపు నీటిలో ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు లోపలకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. మోటర్లతో లోపల నీటిని బయట ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి తోడితే తప్ప తగ్గే అవకాశం లేదు. డిపో, వర్క్‌షాప్, టైర్ షాప్‌ల్లో డ్రెయినేజి వ్యవస్థ సక్రమంగా లేకపోవడం ఒక కారణమైతే వర్క్‌షాప్ సమీపంలోని లేబర్ కాలనీలో వర్షపు నీరు బయటకు పంపేందుకు ఇటీవల నిర్మించిన కల్వర్ట్ మరో కారణమని ఉద్యోగులు చెబుతున్నారు. దశాబ్దాలుగా ఉన్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనలేని సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్క్‌షాప్ లోపల ఉన్న మెషినరీ సెక్షన్‌లోకి కూడా వర్షపు నీరు వచ్చేస్తుండటంతో మోటర్లు ఇతర యంత్ర సామాగ్రి ఆ నీళ్లల్లో తేలియాడే పరిస్థితి నెలకొందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల విలువ చేసే యంత్రాలు, పరికరాలు నీట మునిగి పాడైపోయి పని చేయని దుస్థితిలో ఉంటే తాము ప్రొడక్షన్ ఎలా తీయగలమని ప్రశ్నిస్తున్నారు.

బస్సులు లోపలకు, బయటకు వచ్చే పరిస్థితి లేదు

విద్యాధరపురం ఆర్టీసీ డిపోలో లోపల ఉండే బస్సులు బయటకు, బయట నుంచి లోపలకు రావాల్సిన బస్సుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. కొన్ని సందర్భాలలో బస్ ఇంజన్‌లోకి కూడా నీళ్లు వెళ్లే పరిస్థితి. వాటిని మళ్లీ బయటకు పంపాలంటే మరమ్మతులు చేయాల్సిందే. ఇప్పటికే డిపోలోని బస్సుల్లో ఎక్కువ శాతం కండిషన్‌లో లేనివే కావడం గమనార్హం. కండిషన్‌లో ఉన్న బస్సులనయినా ముంపు బారి నుంచి కాపాడుకోలేని దుస్థితి. డ్రైవర్లు, ఉద్యోగులపై పెత్తనం సాగించే అధికారులు ముంపు నివారణకు తీసుకుంటున్న చర్యలు శూన్యం . ఆర్టీసీ యాజమాన్యం తక్షణం ముంపు నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ముంపునకు గురికాకుండా కాపాడండి

పీజీఆర్‌ఎస్‌లో మొరపెట్టుకున్న లేబర్ కాలనీ వాసులు



అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న లేబర్‌కాలనీవాసులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని లేబర్‌కాలనీ ముంపునకు గురికాకుండా కాపాడాలని ఆ కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ నుంచి ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోకి ఇటీవల నిర్మించిన డ్రెయిన్ కారణంగా చిన్నపాటి వర్షానికే వర్క్‌షాప్ రోడ్‌లోని కాలువలోని మురుగు నీరు ముందుకు కదలని పరిస్థితిలో ఆ కాలువలో కలుస్తున్న లేబర్‌కాలనీలోని నీరు వెనక్కువచ్చి కాలనీ ముంపునకు గురవుతోందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. లేబర్‌కాలనీకి ఉత్తరం వైపు రోడ్‌లోని మోడరన్ మార్ట్ టీ స్టాల్ వద్ద గల కల్వర్ట్‌కు కలుపుతూ డ్రెయిన్, రోడ్ నిర్మాణం చేపట్టి కాలనీలో నివసిస్తున్న సుమారు 1500 కుటుంబాలను ముంపునకు గురికాకుండా కాపాడాలని కోరారు.

పొట్టిశ్రీరాములు కాలేజీతో డేటా వ్యాలీ సంస్థ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులకు మరింత మెరుగైన భవితను అందించేందుకు డేటా వ్యాలీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఆ సంస్థ సీఈవో చలమలశెట్టి పవన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ రియల్‌టైమ్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. అతిథి ఉపన్యాసాలు, పరిశోధనా అవకాశాలు, కృత్రిమ మేధస్సు రంగాల్లో తమ సంస్థ విద్యార్థులకు అండగా ఉంటుందని వివరించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులకు మరింత మెరుగైన భవిష్యత్‌ను అందించేందుకు తమ కళాశాలు పలు ప్రముఖ సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ఉపాధ్యక్షుడు పొట్టి సురేంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ శ్రీనివాసరావు విభాగాధిపతి డాక్టర్ వి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని బాలగణపతి మందిరంలో స్వామి వారు శ్రీ విద్యాగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయంలో కొలువై ఉన్న స్వామి వారి 40వ వార్షిక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం విద్యాగణపతిగా అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవ, అనంతరం సహస్ర నామార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి సహస్ర మోదక (ఉండ్రాళ్లు) పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

స్వామి వారి సన్నిధిలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలను, ఇతర స్టేషనరీ సామగ్రిని నిర్వాహకులు పంపిణీ చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో ప్రవక్త కేశం ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మిలాదున్నబి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని జుమ్మా మసీదు ప్రాంగణంలో ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో హజరత్ మహ్మద్ వారి కేశం ప్రదర్శనకు ఉంచుతామని ఆ సంస్థ మేనేజర్ షేక్ నూర్ తెలిపారు. ప్రవక్త జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా ఆ ప్రత్యేక గదిని తెరచి మహ్మద్ ప్రవక్త కేశం ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అదే క్రమంలో ఈ ఏడాది సైతం ప్రదర్శన ఉంటుందన్నారు. ఐదో తేదీన ముస్లిం పురుషులకు, ఆరో తేదీన ముస్లిం మహిళలకు ప్రదర్శనకు అనుమతిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాల్లో మసీదు ప్రముఖులు అబ్దుల్ ముస్తఫా రిజ్వీ ఖాతీబ్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.3.03 లక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీనగరాల సీతారామస్వామి, మహాలక్ష్మీ అమ్మవార్లకు భక్తులు హుండీ ద్వారా రూ.3.03 లక్షలను సమర్పించారు. చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థాన ఆస్థాన కల్యాణ మండపంలో సోమవారం హుండీ కానుకలు, మొక్కుబడులు, ముడుపులను లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజన్, ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షణలో కానుకల లెక్కింపు జరిగింది. చిట్టినగర్ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో రూ.2,51,731 నగదు, సీతారామ స్వామి వారి ఆలయంలో రూ.52,140, మొత్తంగా రూ.3,03,872 మేర ఆదాయం లభించిందన్నారు. దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఇతర సభ్యులు, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

పాలసీదారుల సేవలో అగ్రగామి ఎల్‌ఐసీ



ప్రత్యేక సేవా కౌంటర్‌ను ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాలసీదారుల సేవలో అగ్రగామి బీమా సంస్థగా ఎల్‌ఐసీ నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. సోమవారం భవానీపురం భారతీయ జీవిత బీమా సంస్థ నగర శాఖ ఆధ్వర్యంలో ఎల్‌ఐసీ వార్షిక వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం జరిగింది. గొల్లపూడి మహాత్మా గాంధీ కమర్షియల్ కాంప్లెక్స్ అధ్యక్షుడు పరుచూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రత్యేక సేవా కౌంటర్‌ను ప్రారంభించారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కె.జయరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రపంచ అగ్రగామి బీమా సంస్థలలో ఎల్‌ఐసీ ఒకటని పేర్కొన్నారు. 30 కోట్ల మంది పాలసీ దారులు కలిగి ఉన్న ఎల్‌ఐసీ గత ఆర్థిక సంవత్సరంలో కేవలం ఒక్క రోజులోనే 5.8 లక్షల పాలసీలను పూర్తి చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం పొందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.మురళీకృష్ణ, సీహెచ్ కిషోర్ కుమార్,కె.సుధాకరరావు, అభివృద్ధి అధికారి పి.అరుణ రావు, ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్ ఎంకే ప్రసాద్, ఎస్ ఏ సలీం, వి శ్రీనివాసులు, ఎన్. బాలాజీ సింగ్, పీఆర్‌కే కోటేశ్వరరావు, ఏజెంట్ల సంఘం నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, బీవీ బాల కోటేశ్వరరావు, లక్ష్మీ కుమార్, ఎస్. సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ రహదారిపై ప్రయాణం నరకప్రాయం

- ఇన్నర్ రింగ్, ఫ్లై ఓవర్‌పై భారీ గోతులు
- రబ్బీష్‌తో గోతులకు మరమ్మతులు
- వర్షంతో మళ్లీ యథా స్థితికి
- కూటమి ప్రభుత్వ తీరుపై వాహన చోదకుల ఆగ్రహం





కబేళా సెంటర్ సమీపంలో చనుమోలు వెంకట్రావు ఫ్లై ఓవర్‌పై అధ్వానంగా ఉన్న రోడ్డు ; జక్కంపూడి గ్రామపంచాయతీ కొబ్బరితోట జంక్షన్ వద్ద రోడ్డు దుస్థితి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే వైవీ రావు ఎస్టేట్ ఇన్నర్ రింగ్, పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్‌పై భారీ గోతులతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నాలుగు నెలలుగా ఈ రోడ్డు దుస్థితి ఇదే రీతిలో కొనసాగుతోంది. గోతులను పూడ్చడంలో కూటమి ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నర్ రింగ్, ఫ్లై ఓవర్‌పై గోతులలో రబ్బీష్ వేసి మమా అనిపిస్తున్నారని, చిన్నపాటి వర్షంతో ఆ రబ్బీష్ కొట్టుకుపోయి గోతులు మళ్లీ యథాస్థితికి వస్తున్నాయని వాహన చోదకులు అంటున్నారు. విజయవాడ రూరల్ ప్రాంతాలైన అంబాపురం, నైనవరం, వెలగలేరు, పి.నైనవరం, కొత్తూరు తాడేపల్లితో పాటు షాబాద్ నుంచి నగరానికి చేరుకునే వారికి పాముల కాల్వ, ఇన్నర్ రింగ్, పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్ ప్రధాన మార్గం. ఇక వైఎస్సార్ కాలనీలో నివాసం ఉండే వారు పైపుల రోడ్డు, సింగ్‌నగర్‌కు చేరుకునే వారికి సైతం ఈ రోడ్డే దిక్కు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు దుస్థితిని పాలకులు, అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో 20 రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, దసరా ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు, ఇతర ప్రాంతాల నుంచి తమ స్వస్థలాలకు చేరుకునే వారితో ఈ రోడ్డుపై ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిలో మీటర్ ప్రయాణం దారుణంగా...

కబేళా నుంచి పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్, వైవీ రావు ఇన్నర్ రింగ్, వెస్ట్ బైపాస్, పాముల కాల్వ మధ్య దూరం కిలోమీటర్ లోపే. ఈ మధ్య ప్రాంతంలో ఉన్న రోడ్డుపై పది అడుగులకు ఒక గొయ్యి దర్శనం ఇస్తుంది. ఈ గోతుల మధ్య ప్రయాణించడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వైఎస్సార్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపున ఈ గోతుల కారణంగా వైవీ రావు ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది.

ఇనుప ఊచలు బయటకు...

పాలప్రాజెక్టు నుంచి వైఎస్సార్ కాలనీ, పాముల కాల్వ, ఇన్నర్ రింగ్ రోడ్డుకు చేరుకునే ఫ్లై ఓవర్‌పై గోతుల నుంచి ఇనుప సువ్వలు బయట పడ్డాయి. రాత్రి 10 గంటల నుంచి భారీ వాహనాలను ఫ్లై ఓవర్ మీదుగా నగరంలోకి అనుమతిస్తారు. ఇటు కబేళా వైపు నుంచి పాముల కాల్వ వైపు వెళ్లే వాహనాలు, అటు నగరంలోకి వచ్చే వాహనాలతో ఫ్లై ఓవర్ బిజీగా మారుతుంది. ఈ సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో టిప్పర్లు, లారీలు, ఇతర వాహనాలను గోతులలో దిగుబడుతున్నాయి. దీంతో గోతులలోని ఇనుప సువ్వలు టైర్లలో దిగబడి లారీలు నడిరోడ్డులో నిలిచిపోతున్నాయి. ఫ్లై ఓవర్‌పై వాహనాలు నిలిచిపోవడంతో వందలాది మంది తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కబేళా సెంటర్ నుంచి ఊర్మిళానగర్‌కు వెళ్లే మార్గంలో...

వెన్నుపోటు బాబు సవాల్ సిగ్గుచేటు

వైఎస్సార్ సీపీ మైనార్టీ నేత గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలకు వెన్నుపోటు పొడిచిన బాబు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సవాల్ విసరటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ మైనార్టీ నేత, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటే మరిన్ని సంక్షేమ పథకాలను ఇస్తానని మోసపూరిత వాగ్దానాలు చేసి అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నేడు అసెంబ్లీలో చర్చకు రావాలంటూ సవాళ్ల పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో అభ్యర్థులు, ప్రజలను ఓటియ్యనివ్వకుండా, ఇతర ప్రాంతాల నుంచి టీడీపీ నాయకులను తీసుకువచ్చి ఓట్లేయించడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రజా తీర్పును తారుమారు చేసి గెలిచిన చంద్రబాబుకు, ప్రజలతో బ్రహ్మరథం పట్టించుకుని సింగిల్‌గా పోటీ చేసిన వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహిస్తే ఎవరు ఏమిటో తేలుతుందని పేర్కొన్నారు.

● అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్నేషనల్ ఓపెన్, బ్లిట్జ్‌ఫైడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీకి చెందిన విద్యార్థి షణ్ముకేశ్వర సాయిరాజ్‌వర్మ ప్రతిభ కనబర్చాడు. రెండు టోర్నమెంట్లలో జరిగిన ఓపెన్ కేటగిరిలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్(1493)ను, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో (1540) రేటింగ్ సాధించాడు. రామకృష్ణ చెస్ అకాడమీలో సాయిరాజ్‌వర్మకు చెస్ కోచ్ అవ్వారు రామకృష్ణ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.